క్లుప్తంగా

షిర్డీ సాయి బాబాకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో షిర్డీ సాయి బాబాకు గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 100 అడుగుల ఎత్తుగల వెంకటి సాయికోటి మహాస్తూపం వద్ద బాబాకు పూజలు చేశారు. పూజ్యగురువుల అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో కార్యక్రమాలు చేపట్టారు. దేవర వలస, పెంట, జాడ, గెద్దకంచరాం, జి.సిగడాం గ్రామాల్లోని బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సాయిదర్బార్‌లో..



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో సాయిదర్బార్‌లో షిరిడీ సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం కాగడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ముమ్మరంగా మెట్టు దుక్కులు



పొలం దున్నుతున్న రైతన్నలు

జి.సిగడాం: రైతన్నలు పంట పొలాలు సాగుచేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. మెట్ట భూములు తయారుచేసేందుకు రైతన్నలు నిమగ్నమయ్యారు. మండల పరిధిలో దేవరవలస, వెలగాడ, చెట్టుపొదిలాం పెంట, నాగులవలస, మర్రివలస, సీతంపేట, ఎందువ, బాతువ, జాడ, జగన్నాథవలస, జి.సిగడాం గ్రామాలతోపాటు పలు గ్రామాల రైతులు మెట్టు ప్రాంతాల్లో పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.


రూ.1.20 కోట్లతో ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణం



పాతపట్నం ఏఎంసీ ఆవరణలో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్

పాతపట్నం: పాతపట్నం, కొసమాల, గొప్పిలి పీఏసీఎస్ పరిధిలోని మూడు చోట్ల మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్లను మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేశారు. పాతపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షలతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. మెళియాపుట్టి మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40 లక్షలు, గొప్పిలిలో రూ.40 లక్షల వ్యయంతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్ల పనులు చేపడుతున్నారు. ఈ భవనాలు పూర్తయితే ఒక్కో భవనంలో 500 మెట్రిక్ టన్నుల పంటను రైతులు స్టోరేజ్ చేసుకోవచ్చునని మార్కెట్ శాఖ డీఈఈ కోటయ్య తెలిపారు.

రైతులను మోసగిస్తే లైసెన్స్ రద్దు



పింద్రువాడలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో సంధ్య

హిరమండలం: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నాణ్యమైనవిగా ఉండాలని, నకిలీవి అంటగట్టి రైతులకు మోసం చేస్తే లైసెన్స్ రద్దుచేస్తామని ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులకు మండల వ్యవసాయశాఖాధికారి బి.సంధ్య హెచ్చరించారు. మండలంలోని పలు షాపులను గురువారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసినప్పుడు చిత్తు కాగితాల్లో రాసి ఇవ్వకుండా ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాలకు స్టోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, స్టాక్ రిజిస్టర్ ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని, ధరలు పట్టిక తప్పనిసరిగా షాపు వద్ద ప్రదర్శించాలన్నారు.

● సంతోషిమాతకు కుంకుమార్చనలు



వైశాఖ మాస అమావాస్య సందర్భంగా అమ్మవారికి పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో విశేష కుంకుమ పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

- శ్రీకాకుళం కల్చరల్

● బాలత్రిపుర సుందరికి అభిషేకాలు



బలగలోని బాలత్రిపుర కాలభైరవస్వామి దేవాలయంలో అమ్మవారికి వైశాఖ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో బాలత్రిపుర సుందరీదేవికి అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

● శనీశ్వరునికి విశేష పూజలు



వైశాఖ అమావాస్య, శనీశ్వరుని జయంతి సందర్భంగా నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ మండపంలోని శనిదేవునికి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో తైలాభిషేకాలు, అర్చనలు జరిగాయి. నక్క వీధిలోని ఉమాజలలేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శివాదిత్య ఆధ్వర్యంలో గ్రహదోషాల నిమిత్తం పూజలు చేశారు.

- శ్రీకాకుళం కల్చరల్

తెలుగు వ్యాకరణంపై అవగాహన



శ్రీకాకుళం అర్బన్: తెలుగు వ్యారణం బోధిస్తున్న మురళి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం రిసోర్స్ పర్సన్, తెలుగు పండిట్ ముద్దాడ మురళి విద్యార్థులకు తెలుగు వ్యాకరణం బోధించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ విద్యార్థులు తెలుగుభాషపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా పాల్గొన్నారు.

పిల్లలకు కథల పోటీలు

శ్రీకాకుళం అర్బన్: బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన ఆధ్వర్యంలో పిల్లలకు నీతి కథలు, పద్యాలపై పోటీలు నిర్వహించారు. టి.నవ్యశ్రీ, కె.నందిని, డి.జోగేంద్రసాయి, కె.ఈశ్వర్‌సాయిలు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉగ్రసేన మాట్లాడుతూ వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వేసవి శిక్షణ తరగతులు ముగింపు రోజైన శుక్రవారం బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్:కథలు, పద్యాల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నీట్ ఫలితాల్లో సుభాష్య ప్రతిభ



సుభాష్యకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నీట్–2024 ఫలితాల్లో జిల్లాకు చెందిన తండ్రాపు సుభాష్య ప్రతిభ కనబర్చింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో సుభాష్య720 మార్కులకుగాను 690 మార్కులు సాధించి శభాష్ అనిపించింది. ఆలిండియాస్థాయిలో 4265వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 1624వ ర్యాంకు సాధించి సీటు ఖాయం చేసుకుంది. తండ్రి తండ్రాపు శ్రీనివాసరావు జెడ్పీహెచ్ స్కూల్ అంపోలులో ఫిజికల్ డైరెక్టర్ (ఎస్ఏ పీఈ)గా పనిచేస్తుండగా, తల్లి పద్మావతి గృహిణి. ప్రస్తుతం శ్రీకాకుళం సమీపంలోని నవభారత్‌నగర్ వద్ద నివాసం ఉంటుండగా.. వీరిస్వస్థలం జిల్లాలోని నరసన్నపేట మండలం సత్యవరం. తమ కుమార్తెకు మెడికల్ సీటు రానుండటంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తి



రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో గురువారం నగరంలో పలు సేవా కార్యక్రమంలో నిర్వహించారు. రక్తనిధి కేంద్రంలో ఇద్దరు రెడ్‌క్రాస్ వలంటీర్లు తమ జన్మదినం సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మూడు యూనిట్ల రక్తం ఉచితంగా అందించారు. నిరుపేదకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందజేశారు. అదే విధంగా, ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలిలో 350 మందికి అన్నదానం చేశారు.



ఏడురోడ్ల కూడలి వద్ద అన్నదానం

మలేరియాపై అవగాహన

జలుమూరు: మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ కుమార్ అన్నారు. రావిపాడు సచివాలయం పరిధిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గురువారం పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఇటీవల నిర్వహించిన ఎల్పీడీసీ సర్వే నివేదికలు పరిశీలించి అనుమానిత కేసులపై స్క్రీనింగ్ చేయాలన్నారు. సీహెచ్‌ఓ జగదీశ్వరి, ఏఎన్ఎం వి.గౌరీ, ఆరోగ్య కార్యకర్త టి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గణితంలో మెలకువలు తెలుసుకోవాలి



లెమన్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

మెళియాపుట్టి: విద్యార్థులకు గణితం ఎంతగానో ఉపయోగపడుతుందని, మెలకువలు తెలుసుకోవాలని ఎంఈఓ–2 పద్మనాభరావు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులకు గణితంలో పలు సూచనలను అందించారు. గ్రంథాలయాలను వినియోగించుకుని చదువులో ప్రతిభ చూపాలని పిలుపునిచ్చారు. అనంతరం లెమన్ స్పూన్ ఆటను ఆడించారు. గ్రంథాలయ అధికారి అనురాధ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడేలా అనేక రకాలైన పుస్తకాలు అందుబాటులో ఉంచామని, వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలను అందజేస్తున్న ఎంఈఓ–2 పద్మనాభరావు

విత్తనాల కోసం పేర్లు నమోదు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు అవసరమయ్యే విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ పైడి లతశ్రీ గురువారం తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం నుంచి రైతుల పేర్లు నమోదు చేయటం జరుగుతుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని వెళ్లి వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ వరిసాగుకు రైతుల కోసం స్వర్ణ, 1061, 1064, సీఆర్, సాంబ మసూరి, సోనా మసూరి, ఎంటీయూ 1224, ఎంపీటీయూ 1318 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలు కావల్సిన రైతులు తమ పేర్లును రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆధార్ కార్డుకు భూములు లింక్ అయిన రైతులకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలానికి 1507 క్వింటాళ్ల వరి విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. గిరిజనుల కోసం 90 ధాయితీపై 420 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. ఇతర రైతులకు కిలో పది రూపాయిల రాయితీపై విత్తనాలను విక్రయించడం జరుగుతుందన్నారు. మండలానికి 9 రకాల వరి విత్తనాలు కేటాయించినట్లు చెప్పారు. ఎకరాకి ఒక బస్తా చొప్పున అందజేస్తామన్నారు.

మెళియాపుట్టి మండలంలో..

మెళియాపుట్టి: మండలంలోని రైతులందరూ విత్తనాల కోసం ఆర్‌బీకేల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధానకర్షుడు గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతూ రైతులందరికీ రాయితీపై విత్తనాలు అందజేస్తామన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాల కోసం పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

హిరమండలం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఏయే విత్తనాలు అవసరమో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి బమ్మిడి సంధ్య గురువారం తెలిపారు. ఎంటీయూ 1224 (మారిటేరు సాంబ), బీపీటీ 5204 (సాంబ మసూరి), ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు), ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1061 (ఇంద్ర), ఎంటీయూ 1064,(అమర), ఎంటీయూ 112(శ్రీధృతి), బీపీటీ 3291 (సోనా మసూరి), ఎంటీయూ 1318 రకాల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 గరిష్ట వేతనం పొందేలా పనులు చేయాలని వేతనదారులకు ఎంపీడీఓ త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని జోగిపాడు, నేరడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను పరిశీలించారు. పనులకు రానటువంటి వేతనదారులకు హాజరవ్వాలన్నారు. నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే గరిష్ట వేతనం వస్తుందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. పనుల్లో సమయం పాలన పాటించాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



జి.సిగడాం: ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ను కలిసిన వాండ్రంగి గ్రామస్తులు, నాయకులు



రణస్థలం: ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ను కలిసిన పరిశ్రమల ప్రతినిధులు

జి.సిగడాం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు(ఎన్ఈఆర్)ను మండలంలోని సీనియర్ నాయకులు బూరాడ వెంకటరమణ, సనపల త్రినాథరావు, సర్పంచ్ సాకేటి నాగరాజులతోపాటు వందలాది మంది కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వగా కలిశారు. వాండ్రంగి గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. మడ్డువలస సాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటపల్లి, మడ్డువలస సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పరిశ్రమల ప్రతినిధులు

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును పైడిభీమవరం పారిశ్రామికవాడలో గల ఏపీటోరియా, శ్రేయాస్ పరిశ్రమల ప్రతినిధులు గోపాల కృష్ణారెడ్డి, కె.కమలాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని బంటుపల్లిలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఇరువురు చర్చించుకున్నారు. సామాజిక కార్పొరేట్ బాధ్యతలో భాగంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలని కోరారు.

శుభాకాంక్షలు..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును ఎచ్చెర్ల మండలంలో బడివానిపేట గ్రామానికి చెందిన నాయకులు గురువారం అభినందించారు. రణస్థలంలో పలు గ్రామానికి చెందిన నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్యే ఈశ్వరరావును అభినందిస్తున్న డైరెక్టర్ ధనబాలాజీ



ఎచ్చెర్ల క్యాంపస్: ఎమ్మెల్యే ఈశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌జీయూకేటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావును శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విశ్వవిద్యాలయం డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆర్‌జీయూకేటీ ప్రగతికి కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే గొండుకు బీజేపీ నేతల అభినందనలు



ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికైన గొండు శంకర్‌ను గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో స్థానిక బీజేపీ నాయకులు కలిసి అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకుల సహకారంతో ఉమ్మడిగా కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే గొండు పేర్కొన్నట్టు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు చల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాధు కిరణ్‌కుమార్, రావాడ పురుషోత్తం, చిట్టి తవుడు, బైరి అప్పారావు, ముకళ్ల లక్ష్మీనారాయణ, మాధవరావు, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో లాభాలు



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి

హిరమండలం: ప్రకృతి సేద్యం, నవధాన్యాల సాగుపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీసీఎన్ఎఫ్ అదనపు డీపీఎం ధనుంజయరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీఓ వి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఎంఎంఎస్‌సభ్యులు, సీసీలు, వీఓఏలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా వికాస్ కేంద్రాలు ఏడు ఉన్నాయని, అందులో సభ్యులకు 30 రకాల పీఎండీఎస్ కిట్లు తయారీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ సూర్యనారాయణ, సీసీలు అసిరయ్య, అప్పన్న, శ్రీదేవి, జయంతి, సుజాత, అకౌంటెంట్ బేబీ తదితరులు పాల్గొన్నారు